క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డీజీఎంకు అభినందనలు


హెచ్‌ఆర్ అధికారిణి రాధికను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డీజీఎం డాక్టర్ డి.రాధికను స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. కోక్‌ఓవెన్స్, ఆర్ ఎంహెచ్‌పీ, సింటర్ ప్లాంట్, టీపీపీ విభాగాల హెచ్‌ఆర్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాధికను యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్‌గా నియమించారు. లైజన్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో కొమ్ము ప్రసాదరావు (ఐఎన్‌టీయూసీ), తాండ్ర కనకరాజు (ఏఐటీయూసీ), కె. ఆనందకుమార్ (సీఐటీయూ) పాల్గొన్నారు.

జూనియర్ మోడల్ చిహ్నికకు సత్కారం


చిహ్నికను సత్కరిస్తున్న దృశ్యం

గాజువాక : ఇటీవల కేరళలో నిర్వహించిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పోటీల విజేత చిహ్నికను క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. ఈ మేరకు గాజువాకలో నిర్వహించిన కార్యక్రమంలో క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ ప్రతినిధులు చిహ్నికను శాలువాతో సత్కరించి అభినందించారు. సంస్థ వ్యవస్థాపకురాలు నందిని మాట్లాడుతూ చిహ్నిక చిన్నవయస్సులోనే విశేష ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనితా పట్నాయక్, సువ్వాడ రోహిత్, చిహ్నిక తల్లి హారిక, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

అనాథబాలలకు భోజన వసతి


అనాథ బాలలకు భోజనం అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ స్మృతి దివస్ యోజన పథకంలో భాగంగా దువ్వాడలోని ఎస్‌జీ ఫౌండేషన్‌లోని బాలలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను అందించారు. సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు తండ్రి అప్పారావు 9వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ బంధువులు, స్నేహితులు వారి హితుల జ్ఞాపకార్థం సర్వహిత ట్రస్ట్ ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అలాగే కొండయ్యవలసకు చెందిన వృద్ధ మహిళలకు చేతి కర్రలను అందించారు. కార్యక్రమంలో రామ అప్పారావు, లక్ష్మీ చంద్రకాంతం దంపతులు, రమణ, బాలకృష్ణ, గుడివాడ త్రివేణి, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


జీలకర్ర,బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ముమ్మరంగా కార్డన్ సెర్చ్

- జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పోలీసుల తనిఖీలు
- 130 మంది సిబ్బందితో 6 వేల ఫ్లాట్లలో సోదాలు
- సరైన పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు సీజ్


మంగళపాలెంలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఫ్లాట్లలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ఎర్రంనాయుడు


సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ త్రినాథ్

అగనంపూడి: గాజువాక శివారు ప్రాంతం మంగళపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, జీవీఎంసీ కాలనీ, హుద్‌హుద్ తుఫాన్ కాలనీల్లో దువ్వాడ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం తెల్లవాము జాము నుంచి ఉదయం పది గంటల వరకు ఆరువేల ఫ్లాట్లల్లో 130 మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. కాలనీ నుంచి బయటకు వెళ్లే ఏడు మార్గాల్లో నిఘా పెట్టి సుమారు ఆరు గంటల పాటు అణువణువు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఇద్దరు రౌడీ షీటర్ల ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. వారిపై నిఘా పెట్టారు.

మరో పది రోజుల్లో సాధారణ ఎన్నికల కౌటింగ్ ఉన్న నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గాజువాక నియోజకవర్గం పరిధిలో ఎక్కువ మంది అనుమానితులు సంచరించడం, అలాగే ఈ కాలనీల్లో తక్కువ ధరకే అద్దెకు ఫ్లాట్లు దొరకుతుండడంతో ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ స్థావరాలుగా ఏర్పాటు చేసుకొని అక్రమ వ్యాపారాలు, లావాదేవీలు సాగిస్తున్నారనే అనుమానాలు చాలా రోజుల నుంచి ఉన్నాయి. గంజాయి అక్రమ రవాణాకు అడ్డాగా ఈ కాలనీని కొంతమంది మార్చేశారని ప్రచారం ఉంది. ఈ క్రమంలో ఈ కాలనీల్లో కార్డన్ అండ్ సెర్చ్ చేపట్టారు. మారణాయుధాలు, మందుగుండు సామగ్రి, గంజాయి, అక్రమ మద్యం నిల్వలు ఉన్నాయనే అనుమానంతో కాలనీలోని ప్రతీ ఫ్లాట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

వాహనం వదిలి వాహనచోదకుడు పరార్

ఒక పోలీస్ బృందం వాహనాల రికార్డులు పరిశీలించగా సరైన పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఒక ద్విచక్రవాహన చోదకుడు తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనాన్ని వదిలి పారిపోయాడు.

అనుమానితులు సంచరిస్తే సమాచారమివ్వండి

గాజువాక సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల ఆదేశాల మేరకు ప్రతీ నియోజకవర్గంలో సమస్యాత్మకంగా భావించే కాలనీల్లో కార్డన్ అండ్ సెర్చ్ చేపట్టామన్నారు. అందులో భాగంగా జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి సెర్చ్ చేపట్టామన్నారు. ఈ పరిధిలో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలని కాలనీవాసులను కోరారు. ఈ సెర్చ్‌లో దువ్వాడ పోలీస్ సిబ్బంది, స్టీల్‌ప్లాంట్, గాజువాక ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాలు ఆపి పత్రాలను పరిశీలిస్తున్న ఏసీపీ త్రినాథ్

నూకాంబిక సన్నిధిలో సామూహిక కుంకుమార్చన


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


పూజలందుకుంటున్న నూకాంబిక అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ వారి నవరాత్రి మహోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో జరిగిన పూజల్లో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా బంగారుమాంబ ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఏర్పాట్లు చేపట్టారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


ధ్యానం చేస్తున్న సొసైటీ సభ్యులు

పెదగంట్యాడ: ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ధ్యానం దోహదం చేస్తుందని అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం విశాఖపట్నం ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివనాగేశ్వరరావు అన్నారు. బుద్ధపౌర్ణమిని పురస్కరించుకుని పెదగంట్యాడ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శివ గణేశ్వరరావు పర్యవేక్షణలో మూడు రోజుల పాటు 7 గంటలు సామూహిక ధ్యాన యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రతి రోజూ ధ్యానం చేయాలని సూచించారు. మనసు ప్రశాంతంగా ఉంటే ఎటువంటి జబ్బులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వనిత, దేవిక, ధనలక్ష్మీ,, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్


స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

మహారాణిపేట : ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్, జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌లతో కలిసి పార్లమెంట్, అంసెబ్లీకి సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలపై ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు వేగవంతం కావాలని సూచించారు. అనంతరం మీడియా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితిని గమనించారు. ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

అక్రమంగా నిర్మించిన షెడ్ల తొలగింపు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ భూమి ఆక్రమణపై అధికారులు ఉక్కుపాదం మోపారు. ఆ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన మూడు షెడ్లను తొలగించారు. స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీఎస్ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడ సర్వే నెంబర్ 55/2లో దిబ్బపాలెం ఆర్‌హెచ్ కాలనీలోని ప్రాంతంలో ఉన్న భూమిని గతంలో స్టీల్‌ప్లాంట్ అధికారులు భూసేకరణ చేశారు. ఆ స్థలాన్ని గంగవరం పోర్టు నిర్మాణ సమయంలో దిబ్బపాలెం గ్రామానికి చెందిన నిర్వాసితులకు కేటాయించారు. అందులో మిగిలి ఉన్న భూమిని ఆక్రమించేందుకు కొంతమంది ప్రయత్నాలు చేశారు. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు ఆ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని అప్పట్లో హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అధికారులు ఎవరూ ఇటువైపు రారనే ఉద్దేశంతో వారు అక్రమంగా అక్కడ మూడు షెడ్లు నిర్మించారు. దీనిపై ఒక్కసారిగా దిబ్బపాలెం గ్రామానికి చెందిన వారు ఫిర్యాదులు చేయడంతో స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత స్పందించారు. ఆక్రమణలు తొలగించి, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్‌డీసీ ఆదేశాల మేరకు ఆర్‌ఐ, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది శుక్రవారం ఆ స్థలాన్ని పరిశీలించి, అక్కడ నిర్మించిన షెడ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌డీసీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


స్టీల్‌ప్లాంట్ స్థలంలో నిర్మించిన షెడ్లను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

అన్నమయ్య సంకీర్తనలతో ఆధ్యాత్మిక తన్మయత్వం

- టీటీడీ ఆస్థాన గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి
- ముగిసిన సంకీర్తనా యజ్ఞం


కొండవీటి జ్యోతిర్మయిని సత్కరిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: అన్నమయ్య సంకీర్తనలతో ఆధ్యాత్మిక తన్మయత్వానికి లోనవుతామని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. వడ్లపూడిలో కాపారపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనా యజ్ఞంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో సంకీర్తనా రాయబారిగా ఆమె ప్రవచనాలు, సంకీర్తనల ఝరిలో ఆధ్యాత్మికవేత్తలు, సామాజికవేత్తలు ఓలలాడారు. కాపారపు ఫౌండేషన్ అధినేత కాపారపు శివన్నాయుడు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాధం, బ్రహ్మశ్రీ భాస్కర భట్ల సత్య ప్రసాద్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గీతాచార్య భక్తి గీతాంజలి యజ్ఞం శ్రీ గౌరీసేవా సంఘం ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి గాయకు లు, సంకీర్తనాభిమానులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పేడాడ హేమలత, ఆధ్యాత్మికవేత్తలు అట్లూరి రమేష్, అద్దంకి రాఘవాచార్యులు, బెండి సత్యం, సీపాన రమేష్‌బాబు, పట్టా రామ అప్పారావు, కాసా పద్మరాజు, బలిరెడ్డి సత్యనారాయణ, కొల్లి బుచ్చిరాజు గుప్తా, దుర్గా ప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు ఊపిరి తీస్తే ఆంధ్రులకు అన్యాయం'

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు సంస్థలకు అమ్మేస్తే ఆంధ్రులకు తీరని అన్యాయం చేసినట్టేనని విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు సుబ్బయ్య, వెంకటేశ్వరరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1198వ రోజు, శుక్రవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేలాది మంది పోరాటం, 23 మంది అమరుల ప్రాణత్యాగంతో ఏర్పాటు చేసిన ఉక్కు కర్మాగారం ఎవరి దాహానికో బలికావడం దారుణమన్నారు. ఇలాంటి దారుణానికి ఒడిగడుతున్న కేంద్రం తగిన మూల్యం చెల్లించుకోవల్సిన పరిస్థితి రానుందన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, శ్రీనివాసనాయుడు, కె.వెంకటరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీలపై యువ కార్మికుల ధర్నా


యువ కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో కార్మికుల క్వార్టర్ల విద్యుత్ చార్జీల పెంపుపై యువ కార్మికులు ధర్నా చేశారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కునగరం టౌన్ అడ్మిన్ విభాగం వద్ద జరిగిన కార్యక్రమంలో యువ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కరెంటు చార్జీలు తగ్గించాలంటూ నినాదాలు చేశారు. సంబంధిత విభాగం అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో కార్మికులు విభాగం కారిడార్, మెట్ల వద్ద బైఠాయించారు. వేతన ఒప్పందం జరగకపోవడం వల్ల ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమకు కరెంటు చార్జీల పెంపు తీవ్రభారాన్ని కలిగిస్తోందన్నారు. వెంటనే చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, డి.ఆదినారాయణ తదితరులు అక్కడికి చేరుకుని వారికి మద్దతు తెలిపారు. కరెంటు చార్జీల పెంపు అన్యాయమని, చార్జీలు తగ్గించే వరకు తాము ఆందోళన కొనసాగిస్తామని తెలపడంతో కార్మికులు ధర్నా విరమించారు.

'నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 'నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ ఆలుమ్ని సమావేశ మందిరంలో శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు, నటుడు షాహిద్ అబ్దుల్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని.. ఏపీలో జూన్ 15 వరకు, తెలంగాణలో జూన్ 17 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి, విజేతలుగా నిలిచిన వారికి ఫైనల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. విశాఖ వేదికగా ఫైనల్ పోటీలు జరుగుతాయని, పూర్తి వివరాలకు స్టార్ ఆఫ్ ఇండియా ఇన్‌స్టా పేజీని సందర్శించాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విభాగాలుగా మ్యూజిక్, డాన్స్, ఆర్ట్స్ రంగాల్లో అన్ని వయసుల వారి ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 41.1 కేజీల గంజాయి స్వాధీనం

జీఆర్పీ అదుపులో గంజాయి రవాణాదారుడు


గంజాయి రవాణాదారుడితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన బస్వా అప్పారావు వద్ద నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.2.05 లక్షల విలువైన 41.1 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


ఇంటర్వ్యూలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు


హాజరైన అభ్యర్థులు

గాజువాక : టెక్ మహీంద్ర సంస్థలో ఉద్యోగాల భర్తీకి స్థానిక చైతన్య మహిళా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (ఏపీఐటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 200 మందికి పైగా అభ్యర్థులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. టెక్ మహీంద్ర ప్రతినిధులు సాయి కిరణ్, ఫజర్, ఏపీఐటీఏ సీఈవో డి.వి.రామ కోటిరెడ్డి, ప్రతినిధులు జనార్దన్, శ్రీధర్ తదితరులు విద్యార్థుల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూల్లో 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చైతన్య మహిళా కళాశాల కరస్పాండెంట్ జి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతో అనర్థాలు

ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణ కుమారి


ప్రదర్శనలో పాల్గొన్న సీడీపీవో, ఏసీడీవో తదితరులు

విశాఖ విద్య: ఆరోగ్యమే మహాభాగ్యం అని స్త్రీ శిశు సంక్షేమ శాఖ విశాఖ అర్బన్ చైల్డ్ డెవలప్‌మెంట్(సీడీపీవో) అధికారి రమణకుమారి, ఏసీడీపీవో శ్రీలత అన్నారు. 'ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం' సందర్భంగా అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సింహాచలం సెక్టార్ పరిధిలోని ఎస్‌పీడీ వెంకటాపురం (గణేష్ నగర్) అగన్‌వాడీ కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కిశోర బాలికలు, బాలింతలు, మహిళలతో ఎస్‌పీడీ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రమణకుమారి, శ్రీలత మాట్లాడుతూ మూఢనమ్మకాలతో అనర్థాలు వస్తాయన్నారు. నెలసరి సమయంలో తగిన పరిశుభ్రత పాటించటం ద్వారా ఆరోగ్యపరమైన సమస్యలను తప్పించుకోవచ్చన్నారు. కిశోర బాలికలు ఈ విషయంలో సంకోచం లేకుండా తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. తద్వారా భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్యపరమైన సమ్యలను ముందుగానే నివారించే అవకాశం ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య నియమాలు పాటిస్తూనే తగిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ఎంతో రుచికరమైన, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, కార్యకర్త మార్త తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వజ్రపుకొత్తూరు: అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జీడితోటల్లో శుక్రవారం గొర్లె ఉమామహేశ్వరరావు(26) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్.రామారావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడున్న ఐడీకార్డు ఆధారంగా మృతుడు విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డులో లేబర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఆనవాళ్లను బట్టి గురువారం రాత్రి ఉరి వేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. గుర్తింపు కార్డు తప్ప మరెలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో వివరాల కోసం నేవల్ డాక్‌యార్డును సంప్రదిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడు ఎరుపు చారలతో ఉన్న తెలుపు టీ షర్టు, నలుపు షార్టు(నిక్కర్)ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, వివరాలను తెలిసిన వారు వజ్రపుకొత్తూరు పోలీసులను సంప్రదించాలని కోరారు. వీఆర్వో రెయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.